RNI NO: TGTEL/26/A0383


డైనమిక్

# జనం వాయిస్

తెలుగు దినపత్రిక    06-02-2026 శుక్రవారం

**5PM** స్పెషల్ ఎడిషన్

## లుకేమియా బాధిత చిన్నారికి సీఎం రేవంత్ రెడ్డి తక్షణ సహాయం



**జనం వాయిస్, హైదరాబాద్:**

హైదరాబాద్‌కు చెందిన రెండేళ్ల చిన్నారి ఫినెహాస్ అక్యూట్ లింఫోబ్లాస్టిక్ లుకేమియా వ్యాధితో బాధపడుతున్నట్లు తెలిసిన వెంటనే గౌరవ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పందించారు. చిన్నారికి తక్షణ వైద్య చికిత్స అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు అధికారులు వెంటనే చిన్నారి కుటుంబ సభ్యులతో సంప్రదింపులు జరిపారు. అలాగే బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి అధికారులతో మాట్లాడి, చిన్నారిని ఆసుపత్రిలో చేర్పించాలని సూచించారు. చికిత్స ఆలస్యం కాకుండా తక్షణమే వైద్య సేవలు ప్రారంభించేలా ఏర్పాట్లు చేశారు. చిన్నారి వైద్య చికిత్సకు అయ్యే ఖర్చుల భారం కుటుంబంపై పడకుండా ప్రభుత్వం తరఫున సహకారం అందించనున్నట్లు అధికారులు తెలిపారు. దీనికి సంబంధించి ఎల్‌ఓసీ జారీ చేయనున్నట్టు స్పష్టం చేశారు. ప్రభుత్వం ఎప్పుడూ పేదలు, బాధితుల పక్షానే ఉంటుందని, ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్య విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండదని అధికారులు పేర్కొన్నారు. చిన్నారి త్వరగా కోలుకోవాలని కుటుంబ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## విద్య ప్రాముఖ్యతపై దృష్టి ఆకర్షణ.రాష్ట్రపతి

**జనం వాయిస్, సిమ్లిపాల్, ఒడిశా:**

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఒడిశాలోని సిమ్లిపాల్ ప్రాంతంలో గిరిజన మహిళలు, యువతతో ప్రత్యేకంగా మమేకమయ్యారు. ఈ సందర్భంగా వారి జీవన పరిస్థితులు, విద్య, ఉపాధి అంశాలపై రాష్ట్రపతి చర్చించారు. రాష్ట్రపతి మాట్లాడుతూ విద్యే జీవితంలో మార్పుకు ప్రధాన సాధనమని స్పష్టం చేశారు. గిరిజన విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల లబ్ధిని పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. విద్య ద్వారా మాత్రమే సమాజంలో గౌరవం, ఆర్థిక స్వావలంబన సాధ్యమవుతుందని తెలిపారు. అలాగే మహిళలు, యువత కష్టపడి పనిచేస్తూ తమ సామర్థ్యాలను పెంపొందించుకోవాలని రాష్ట్రపతి హితవు పలికారు. దేశ అభివృద్ధి ప్రయాణంలో గిరిజన సమాజం కూడా క్రియాశీల పాత్ర పోషించాలని ఆమె పిలుపునిచ్చారు. సిమ్లిపాల్ ప్రాంత గిరిజనులలో ఉన్న ప్రతిభ, శ్రమ దేశానికి బలమని పేర్కొన్న రాష్ట్రపతి, ప్రభుత్వం వారి సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమం గిరిజన సమాజంలో కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపిందని అధికారులు తెలిపారు.

## బీఆర్ఎస్ పార్టీ నేతలపై దాడి.

- తీవ్రంగా ఖండించిన కేటీఆర్.
- కాంగ్రెస్ గుండాల దాడిపై ఆగ్రహం.
- పార్టీ నేతలకు అండగా ఉంటామని భరోసా.
- మేడ్చల్ జిల్లాలో నేతలపై దాడి ఘటనపై స్పందన.
- జూబ్లీహిల్స్ కార్పొరేటర్‌పై దాడిని కూడా ఖండన.

**జనం వాయిస్, హైదరాబాద్:**

బీఆర్ఎస్ పార్టీ నేతలపై కాంగ్రెస్ గుండాలు దాడులు చేయడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. మేడ్చల్ జిల్లాలో చోటుచేసుకున్న ఘటనపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిలతో కేటీఆర్ ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ తరఫున పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ ఘటనపై వెంటనే స్పందించిన కేటీఆర్, మేడ్చల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రాజు శంభీపూర్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్లను బాధిత నేతల వద్దకు వెళ్లి పరామర్శించాలని సూచించారు. పార్టీ నేతలపై దాడులు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే సందర్భంగా జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ కార్పొరేటర్ దేదీప్యపై ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ఆయన అనుచరులు చేసిన దాడిని కూడా కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. దేదీప్యతో ఫోన్‌లో మాట్లాడిన ఆయన ధైర్యంగా ఉండాలని చెప్పారు. ఈ ఘటన నేపథ్యంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్తో పాటు ఇతర నగర బీఆర్ఎస్ నేతలు దేదీప్యను పరామర్శించనున్నట్లు కేటీఆర్ తెలిపారు. బీఆర్ఎస్ శ్రేణులపై దాడులకు భయపడేది లేదని, ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.



## మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

- రేవంత్ వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు.
- ఓట్లతోనే రాజకీయ సమాధానం ఇవ్వాలన్న పిలుపు.
- కార్యకర్తలే నా బలం అంటూ స్పష్టం.
- భావోద్వేగంగా స్పందించిన మాజీ మంత్రి.

**జనం వాయిస్, జగిత్యాల:**

జగిత్యాలలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా కలకలం రేపాయి. రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో పార్టీ మారిన ఎమ్మెల్యేలను రాళ్లతో



కొట్టాలని అన్నారని ఆరోపించిన జీవన్ రెడ్డి, తాను మాత్రం ప్రజాస్వామ్య మార్గంలో ఓట్లతోనే కొడదామని చెబుతున్నానని వ్యాఖ్యానించారు. తన గొంతును కొద్దామని కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించిన ఆయన, తనను అణిచివేయాలంటే ముందు భుజాల్లాంటి తన కార్యకర్తలను దాటి రావాలని సవాల్ విసిరారు. కార్యకర్తలే తన అసలైన బలమని, వారి అండతోనే రాజకీయంగా ముందుకు సాగుతున్నానని తెలిపారు. ఈ సందర్భంగా భావోద్వేగానికి లోనైన జీవన్ రెడ్డి, "జీవితం ముగిసేలోపు నాకు తీవ్ర దుఃఖం మిగిల్చారు" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తనపై జరుగుతున్న రాజకీయ దాడులు వ్యక్తిగతంగా బాధిస్తున్నాయని అన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ప్రజలే తుది తీర్పు చెప్పాలన్నారు. ప్రజాస్వామ్యంలో హింసకు చోటు లేదని, ఎన్నికల ద్వారా సమాధానం ఇవ్వడమే సరైన మార్గమని మాజీ మంత్రి జీవన్ రెడ్డి స్పష్టం చేశారు.

## హిందూ ధర్మ పరిరక్షణలో మౌనం వీడాలి

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపు.

**జనం వాయిస్, డెస్క్:**

ప్రతి భక్తుడిపై ధార్మిక బాధ్యత ఉంటుందని, హిందూ దేవుళ్లను లేదా ధర్మాన్ని కించపరిచినప్పుడు మౌనంగా ఉండకుండా తమ గళాన్ని వినిపించాలని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. సగటు హిందువు మనస్తత్వంలో మార్పు రావాలని, భయం లేదా సౌలభ్యం కోసం మౌనంగా ఉండే ధోరణిని వీడాలని ఆయన సూచించారు. దేవుడిపై భయం, విశ్వాసంపై గౌరవం ఉన్నప్పటికీ, మన ధర్మాన్ని ఎవరైనా దురుద్దేశంతో అపహాస్యం చేసినప్పుడు కేవలం వ్యక్తిగతంగా బాధపడి కర్మకు వదిలేసి ముందుకు సాగే అలవాటు మారాల్సిన అవసరం ఉందని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. ఇలాంటి సందర్భాల్లో మౌనం సమిష్టి చైతన్యాన్ని బలహీనపరుస్తుందని పేర్కొన్నారు. తన వ్యాఖ్యల్లో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, కులం, మతం, ప్రాంతం, భాషల పరంగా మనం విభజనకు గురై ఉండవచ్చని, కానీ ధర్మం మాత్రం ఒక్కటేనని అన్నారు. దేవుళ్లు కూడా ఒకటేనని స్పష్టం చేశారు. ఉద్దేశపూర్వకంగా విశ్వాసాలను, ధర్మాన్ని అవమానించినప్పుడు తమ బాధను తెలియజేయడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని అన్నారు. హిందూ ధర్మాన్ని రక్షించుకోవడం అంటే ఇతర మతాలకు వ్యతిరేకంగా ఉండటం కాదని ఆయన స్పష్టం చేశారు. తమ సొంత విశ్వాసాలు, సంప్రదాయాలను కాపాడుకోవడమే



లక్ష్యమని వివరించారు. హిందువులు తమ ధార్మిక బాధ్యతను గుర్తించి, సోమరితనం వీడి, విశ్వాసాల పరిరక్షణకు సమిష్టిగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మార్పు ద్వారానే హిందూ ధర్మ గౌరవాన్ని కాపాడుకోగలమని పవన్ కల్యాణ్ తెలిపారు.

## బాలకృష్ణ ఇలాకాలో కాల్పుల కలకలం

- రౌడీషీటర్ నాగేంద్రపై పోలీసుల కాల్పులు.
- కాలిలోకి దూసుకెళ్లిన బుల్లెట్ తీవ్ర గాయాలు.
- కత్తితో దాడి చేసిన నిందితుడు.
- ఏపీకర్ణాటకలో 90 కేసుల చరిత్ర.

**జనం వాయిస్, శ్రీ సత్యసాయి జిల్లా:**

శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గంలో కాల్పుల ఘటన కలకలం సృష్టించింది. చిలమత్తూరు మండలం ఎర్రకొండ అటవీ ప్రాంతంలో రౌడీషీటర్ నాగేంద్రపై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో బుల్లెట్ నాగేంద్ర కాలిలోకి దూసుకెళ్లడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం, నాగేంద్రను అరెస్ట్ చేసేందుకు సీఐ ఆంజనేయులు, కానిస్టేబుల్ రవి అటవీ ప్రాంతానికి వెళ్లారు. ఈ సమయంలో నాగేంద్ర పోలీసులపై కత్తితో దాడి చేసి అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించాడు. పరిస్థితి అదుపు తప్పడంతో ఆత్మరక్షణ నిమిత్తం సీఐ ఆంజనేయులు కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు. కాల్పుల్లో గాయపడిన నాగేంద్రను పోలీసులు అదుపులోకి తీసుకుని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటన జరిగిన వెంటనే ప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.



నాగేంద్రపై ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో కలిపి సుమారు 90 కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



గతంలో హిందూపురంలో జరిగిన అత్తాకోడళ్లపై గ్యాంగ్‌రేప్ కేసులో కూడా నాగేంద్ర ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. చాలా కాలంగా పోలీసులకు చిక్కకుండా తప్పించుకుంటున్న ఇతడిని పట్టుకునే క్రమంలోనే ఈ కాల్పుల ఘటన చోటుచేసుకుంది.

## వాకింగ్ పేరుతో భర్తను హతమార్చిన భార్య

- ప్రియుడితో కలిసి దారుణం.







**జనం వాయిస్, రాజస్థాన్:**

రాజస్థాన్‌లో భర్తను వాకింగ్‌కు తీసుకెళ్లి ప్రియుడితో కలిసి హతమార్చిన భార్య ఉదంతం సంచలనం సృష్టించింది. మేఘాలయ హనీమూన్ హత్య తరహాలోనే జరిగిన ఈ ఘటనలో పెళ్లయిన కేవలం మూడు నెలలకే భర్త ప్రాణాలు కోల్పోయాడు. రాజస్థాన్లోని శ్రీరాంనగర్ ప్రాంతానికి చెందిన ఆశిష్ అనే యువకుడు, అదే ప్రాంతానికి చెందిన అంజూ అనే మహిళను మూడు నెలల క్రితం వివాహం చేసుకున్నాడు. జనవరి 30వ తేదీ రాత్రి సమయంలో రోడ్డుపై అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆశిష్, అంజూలను స్థానికులు గుర్తించి ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆశిష్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు అంజూను ప్రశ్నించగా, కొందరు గుర్తుతెలియని వ్యక్తులు వాహనంలో వచ్చి తమను ఢీకొట్టి నగలు లాక్కెళ్లారని ఆమె పోలీసులకు తెలిపింది. అయితే ఆమె చెప్పిన వివరాలకు ఘటనా స్థలంలో ఉన్న పరిస్థితులకు పొంతన లేకపోవడంతో పోలీసులు అనుమానంతో లోతుగా విచారణ చేపట్టారు. పోలీసుల విచారణలో అసలు నిజం వెలుగులోకి వచ్చింది. అంజూ పెళ్లికి ముందే సంజూ అనే యువకుడిని ప్రేమించినట్లు, వివాహం తర్వాత కూడా అతనితో ఫోన్‌లో సంప్రదింపులు కొనసాగించినట్లు తేలింది. పుట్టింటికి వెళ్లిన సమయంలో సంజూతో కలిసి భర్తను హత్య చేయాలనే ప్లాన్ వేసినట్లు పోలీసులు గుర్తించారు. ప్లాన్ ప్రకారం అంజూ తన భర్తను నిర్మానుష్య రహదారిపై వాకింగ్‌కు తీసుకెళ్లగా, అక్కడ సంజూ అతని స్నేహితులతో కలిసి ఆశిష్‌పై దాడి చేసి హత్య చేసినట్లు విచారణలో తేలింది. దొంగతనం జరిగినట్లు నమ్మించేందుకు అంజూ తన మొబైల్ ఫోన్, చెవి కమ్మలను సంజూకి ఇచ్చి పంపించి, తాను స్పృహ తప్పి పడిపోయినట్లు నటించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో అంజూ, ఆమె ప్రియుడు సంజూ సహా ఇతర నిందితులపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన ప్రాంతవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది.